

కోటపల్లి మండలం ఎదుల్లబంధం గ్రామ సమీపంలోని తుంతుంగా వాగును ప్రాణాలకు తెగించి దాటుతున్న ప్రజలు (ఫైల్)



కోటపల్లి మండలం ఎదుల్లబంధం గ్రామం సమీపంలోని తుంతుంగా వాగు పైన పూర్తయిన వంతెన

# ఏండ్ల సమస్యకు ఏడాదిలో పరిష్కారం

- తుంతుంగా వాగుపై బ్రిడ్జి నిర్మాణంతో చరిత్ర సృష్టించిన బాల్క సుమన్
- 10 గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా



కోటపల్లి : ఎదుల్లబంధం సమీపంలోని తుంతుంగా వాగుపైన నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీ సతీశ్ కుమార్

కోటపల్లి, నవంబర్ 11 : ఒక వాగు... పది గ్రామాల ప్రజలకు ప్రాణ సంకటం. వర్షం పడిందంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉండాల్సిన దుస్థితి. వాగు ఉప్పొంగితే ఎటు వాహనాలు అటే.. ఎక్కడి ప్రజలు అక్కడే.. అలాంటి గోస నుంచి చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పది గ్రామాల ప్రజలకు విముక్తి కల్పించారు. ఏండ్ల కొద్ది అపరిష్కృతంగా ఉన్న సమస్యకు ఏడాదిలో పరిష్కారం చూపారు. సమస్యను కండ్లరా చూసిన విప్ బాల్క సుమన్ పట్టుబట్టి నిధులు తెచ్చి వాగుపైన బ్రిడ్జి నిర్మించి తానేంటూ నిరూపించుకున్నాడు. కోటపల్లి మండలంలోని ఎదుల్లబందం గ్రామం సమీపంలోని తుంతుంగా వాగుపైన బ్రిడ్జి లేక వర్షాకాలం వాగు అవతల ఉన్న పది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతుండగా వాగుపైన బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, నిర్మాణ పనులను ఏడాదిలోగా పూర్తి చేసి పది గ్రామాల ప్రజల కష్టాలకు ఫుల్‌స్టాఫ్ పెట్టాడు.

కోటపల్లి మండలంలోని ఎదుల్లబంధం గ్రామ సమీపంలోని తుంతుంగా వాగు కష్టాలు అంతా ఇంతా కావు. భారీ వర్షాలు కురిసి వాగు ఉప్పొంగితే ప్రవాహం అవతల ఉన్న ఎదుల్లబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, సూపాక, వెంచపల్లి, నందరాంపల్లి గ్రామాల ప్రజలు జల దిగ్బధంలో ఉండేవారు. తుంతుంగా వాగు ప్రవాహం అధికంగా ఉంటుండడం వల్ల ఈ గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయేవి. ఎలాంటి కష్టం వచ్చినా నీటి ప్రవాహం దాటే ఆస్కారం లేకపోవడంతో వర్షాకాలం పది గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపేవారు.అలాంటి ప్రజల కష్టాలను కండ్లరా చూసిన ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఎడాది తిరగకముందే వాగుపై బ్రిడ్జి నిర్మాణాకి రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నాడు. ప్రతి సంవత్సరం తుంతుంగా వాగు వల్ల ఇక్కడి ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారు. ప్రతి సంవత్సరం పది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, వారి కష్టాలను 2020 ఆగస్టు 17న ప్రభుత్వ విప్ బాల్క సుమన్ స్వయంగా పరిశీలించారు. వారి సమస్యలను చూసిన విప్ అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ. 8 కోట్ల నిధులు మంజూరు చేయించి గత సంవత్సరం ఏప్రిల్‌లో బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించారు.

**• ప్రభుత్వ విప్ ప్రతేక చొరవతో..**

తుంతుంగా వాగుపై బ్రిడ్జి లేక ప్రతి సంవత్సరం ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. 2020ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు తుంతుంగా చెరువు మత్తడి ఉధృతంగా ప్రవహించింది. సూపాక గ్రామానికి చెందిన నిట్టూరి శ్రీలత అనే గర్భిణికి పురిటి నొప్పులు ప్రారంభం కాగా వాగు ఒడ్డు వద్దే ఉండిపోయింది. పురిటి నొప్పు లు పెరుగుతుండగా, రంగంలోకి దిగిన పోలీస్‌లు, స్థానిక నాయకులు అతి కష్టంమీద ట్రాక్టర్ సహాయంతో గర్భిణిని వాగు దాటించారు. ఈ సమస్యను తెలుసుకున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సమస్యకు పరిష్కారం చూపాలని భావించిన ప్రభుత్వ విప్ సుమన్ పట్టుదలతో ముందుకు సాగి ఇక్కడి ప్రజల కష్టాలను అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళాడు. ఇక్కడి ప్రజల కష్టాలను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం తుంతుంగా చెరువు మత్తడి వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.8 కోట్లు మంజూరు చేసింది.

**• ఏడాదిలో బ్రిడ్జి పూర్తి**

తుంతుంగా వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి పట్టువదలని విక్రమార్కుడిలా కృషి చేసిన ప్రభుత్వ విప్ బాల్క సుమన్ వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను 2021 ఏప్రిల్27న ప్రారంభించారు. బ్రిడ్జి నిర్మాణ శంకుస్థాపన అనంతరం జూలైలో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కేవలం 11 నెలల్లోనే పనులు పూర్తి చేశాడు. విప్ బాల్కసుమన్ ఎప్పటికప్పుడు బ్రిడ్జి నిర్మాణ ప్రగతిని తెలుసుకుంటూ అధికారులకు సూచనలిస్తూ ముందుకు సాగడంతో వర్షాకాలం ప్రారంభానికల్లా బ్రిడ్జి పూర్తయి అందుబాటులోకి వచ్చింది. ఏండ్లుగా పరిష్కారం కాని సమస్య విప్ సుమన్ ప్రత్యేక చొరవతో ఏడాదిలో సాకారం కావడం వల్ల వాగు అవతల ఉన్న పది గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిలోగా బ్రిడ్జి నిర్మాణం పూర్తికాగా 2022 జూన్ 15న రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్‌ల చేతుల మీదుగా ప్రారంభించారు.

### పది గ్రామాల ప్రజల కష్టాలు తీరాయి



తుంతుంగా వాగు పైన బ్రిడ్జి నిర్మాణంతో వాగు ఇవతల ఉన్న మా పది గ్రామాల ప్రజల కష్టాలకు పరిష్కారం దొరికింది. వర్షం పడి వాగు ఉప్పొంగితే మా ఊర్లకు రాకపోకలు నిలిచిపోయేవి. సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నా ఏ ఒక్క నాయకుడు పట్టించుకోలేదు. బాల్క సుమన్ ఎమ్మెల్యే అయిన వెంటనే మా సమస్యను తెలుసుకొని వాగుపైన బ్రిడ్జిని నిర్మించి మా గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు చేసిండు. మా ఊర్లకు రవాణా సౌకర్యం కల్పించిన బాల్క సుమన్‌కు రుణపడి ఉంటాం.

**-అంగూరి బాపు, ఎదుల్లబందం**

### ఏండ్ల సమస్యకు పరిష్కారం దొరికింది



తుంతుంగా చెరువు మత్తడి వద్ద బ్రిడ్జి లేక ఏళ్ల కొద్ది ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం ప్రవాహం ఎక్కువ అయితే బయటకు వెళ్లలేని పరిస్థితి. అత్యవసర సమయాల్లో ఈ ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. మా సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రత్యక్ష్యంగా చూసి మా సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చి బ్రిడ్జి నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేశారు. మా ప్రాంత ప్రజల ఏళ్లనాటి కష్టాలకు తీర్చిన బాల్క సుమన్‌ను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటం.

**- గట్టు పురుషోత్తం, సూపాక**

### థ్యాంక్స్ అన్నయ్య..



ఎదుల్లబందం సమీపంలోని తుంతుంగా వాగు వద్ద ప్రసవ వేదనకు గురై అతి కష్టం మీద ట్రాక్టర్ సహాయంతో వాగును దాటి వెళ్లిన సూపాక గ్రామానికి చెందిన నిట్టూరి శ్రీలత బ్రిడ్జి ప్రారంభోత్సవం రోజున మంత్రి ప్రశాంత్ రెడ్డి, విప్ బాల్క సుమన్‌ను సన్మానించి థాంక్యూ సుమనన్న అని చెప్పింది. ఆ సమయంలో తాను పడిన కష్టం ఏ ఆడబిడ్డ పడకూడదని విప్ సుమన్ పట్టుబట్టి నిధులు తెప్పించి మళ్లీ వర్షాకాలం వచ్చేవరకు పూర్తి చేయగా సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఆడబిడ్డల కష్టంతో పాటు వాగు ఇవతల ప్రజలు పడుతున్న కష్టాలను తీర్చిన సుమన్ అన్నకు ఎళ్లవేలాల రుణపడి ఉంటాం.

**- నిట్టూరి శ్రీలత**

### చిరకాలం స్వప్నం నెరవేరింది



కోటపల్లి మండలంలోని ఎదుల్లబందం గ్రామం సమీపంలోని తుంతుంగా వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ఆ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నాని నెరవేర్చాను. వర్షాకాలంలో ఇక్కడి ప్రజల కష్టాలను కండ్లరా చూసిన వెంటనే ఈ వాగు సమస్యకు ఏడాదిలోగా పరిష్కారం చూపెట్టాలనుకున్నా. ఈ సమస్యను అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో బ్రిడ్జి నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతోప్రజలకు రవాణా కష్టాలను తీరిపోయాయి. ఇక్కడి ప్రజల ఆశీస్సులతో ముందుకెళ్తూ రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతాం.

**- బాల్క సుమన్, ప్రభుత్వ విప్**

# ప్రభుత్వ సహకారం.. మహిళల వ్యాపారం

- 'స్త్రీనిధి'తో అతివల ఆర్థిక ప్రగతి
- మహిళలకు స్వయం ఉపాధి
- తొమ్మిదేళ్లలో మహిళా సంఘాలకు రూ.839.60 కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చిన ప్రభుత్వం

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): మహిళలు ఆర్థిక ప్రగతిని సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి ద్వారా ఆర్థిక చేయూతనందిస్తోంది. దీంతో ఇంటికే పరిమితమైన మహిళలు స్త్రీనిధి రుణాలను పొంది స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఆర్థిక స్వాలంభన సాధిస్తున్నారు. పురుషులతో సమానమైన వేతనాలను స్వయం ఉపాధి ద్వారా పొందుతున్నారు.. తమ కుటుంబానికి పిల్లల చదువులకు ఆర్థిక చేయుతనందిస్తున్నారు. మహిళలు ఆర్థికంగా వ్యాపారాలు చేస్తూ స్వయం ఉపాధి ద్వారా తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రభుత్వం సహకారం అందిస్తోంది.

స్త్రీనిధి పథకం స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు వరంలా మారింది. ఆర్థికంగా ఎదగాలని, తమ కుటుంబానికి ఆసరాగా నిలువాలని ఆసక్తి ఉన్న మహిళలకు పెట్టుబడి సహాయాన్ని అందించి ఆర్థికంగా నిలుదొక్కుకునేలా ప్రభుత్వం చేయుతనందిస్తోంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 7958 మహిళా స్వశక్తి సంఘాల్లోని 88140 మంది మహిళా సభ్యులకు తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో స్త్రీనిధి ద్వారా 839 కోట్ల 76 లక్షల రూపాయల రుణాలను పొందిన మహిళలు తమకు ఆసక్తి ఉన్న స్వయం ఉపాధిని ప్రారంభించి నెలకు 10 నుంచి 15 వేల రూపాయల వరకు సంపాదిస్తున్నారు. తమ కుటుంబానికి ఆర్థిక అవసరాల్లో ఆసరాగా నిలువడంతో తమ కాళ్లపై తాము నిలబడుతున్నారు.

**• ఉపాధికి మంచి అవకాశం..**

స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాల్లోని సభ్యులకు అందిస్తున్న రుణాలు మహిళలు ఉపాధి పొందేందుకు మంచి ఉపాధి మార్గాలను చూపిస్తున్నాయి. స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు ఉపాధి రంగాల్లో రాణిస్తున్నారు. స్త్రీనిధి రుణాలు పొందడం, వాటి ద్వారా ఆర్థిక స్వాలంభన సాధించడంపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదరికంలో మగ్గుతున్న మహిళలు తక్కువ వడ్డీకి రుణాలను పొంది తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకునేందుకు స్త్రీనిధి పథకం మంచి అవకాశంగా భావిస్తున్నారు.

### బేకరీ వ్యాపారంతో ఉపాధి..



చింతలమానెపల్లిలో బేకరీ యూనిట్ నిర్వహిస్తున్న మహిళలు

జిల్లాలోని చింతలమానెపల్లి మండలానికి చెందిన భాగ్య లక్ష్మి గ్రామీణా సంఘంలోని ముగ్గురు మహిళలు స్త్రీనిధి ద్వారా 1లక్ష 50 వేల రూపాయల రుణాన్ని తీసుకొని బేకరి యూనిట్‌ని ప్రారంభించారు. వ్యాపారం మంచి లాభసాటిగా నడుస్తోంది. బేకరీ నిర్వహణ ఖర్చులు పోను నెల కు ఒక్కొక్కరూ 10 నుంచి 15 వేల రూపాయల వరకు లాభాన్ని పొందుతున్నారు. బేకరీ యూనిట్‌లో తయారయ్యే ఐటంలకు స్థానికంగా ఉండే స్వీట్ షాపులు, ఇతర జనరల దుకాణాల్లో విక్రయిస్తున్నారు.

### పేపర్‌ప్లేట్ల తయారీతో మంచి లాభాలు



సిర్పూర్-టీలో పేపర్ ప్లేట్లు తయారు చేస్తున్న మంజునాథ మహిళా సంఘం సభ్యులు

సిర్పూర్-టిలోని మంజునాథ మహిళా సంఘం సభ్యులు ఇద్దరు కలిసి స్త్రీనిధి ద్వారా 1లక్ష 50 వేల రూపాయల రుణాన్ని తీసుకొని పేపర్ ప్లేట్ల మేకింగ్ యూనిట్‌ని ఏర్పాటు చేశారు. ఖర్చులు పోను నెలకు 15 నుంచి 20 వేల రూపాయల వరకు లాభాలు వస్తున్నాయన్నారు. పెళ్లిళ్లు , ఇతర శుభకార్యాల సీజన్‌లో లాభాలు మరింత పెరుగుతున్నాయని, వినియోగదారులు నేరుగా తమ వద్దకే వచ్చి పేపర్ ప్లేట్లను తీసుకెళ్తున్నారని పేర్కొంటున్నారు.

# జీవన విధానాన్ని మెరుగుపర్చుకోవాలి



తిర్యాణి : రైతులకు మేకలు పంపిణీ చేస్తున్న భీంజీగూడ సర్పంచ్ కోవ చిన్న రాజు, సీపీఎఫ్ సంస్థ ఎస్‌పీవో శ్రీనివాస్

తిర్యాణి, నవంబర్11 : పేద రైతులు తమ జీవన విధానాన్ని మెరుగుపర్చుకోవాలని భీంజీగుడ సర్పంచ్ కోవ చిన్న రాజు, సీపీఎఫ్ సంస్థ ఎస్పీవో శ్రీనివాస్ అన్నారు. నాబార్డ్ వారి ఆర్థిక సహకారంతో సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని భీంజీగూడ గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు గాను ఒక్కో రైతుకు 5మేకల చొప్పున మొత్తం 15 మేకలు సుమారు రూ.70 వేల విలువ గల మేకలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. పశు సంపదను పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలను ప్రవేశపెట్టిందన్నారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ మహేందర్,సీఎఫ్ఎఫ్ పెసీలేటర్ సంతోశ్, మాతోట సభ్యులు, లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.